జీవీఎంసీ కి ఐఏ "ఎస్" అధికారి కావలెను!

- రాష్ట్రంలో అతిపెద్ద నగరానికి కమిషనర్ లేక కుంటిపడ్డ పాలన
- కలెక్టర్ కు ఇంచార్జి బాధ్యతలతో కాలయాపన

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: రాష్ట్రంలో ఎంతోమంది ఐఏఎస్ అధికారులు ఉన్నప్పటికీ రాష్ట్రంలో కీలకమైన అతి పెద్ద జనాభా కలిగిన గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ లకు కమిషనర్ ను రాష్ట్ర ప్రభుత్వం దాదాపు నెల రోజులుగా నియమించకపోవడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎంతోమంది ఐఏఎస్ అధికారులు ఉన్నప్పటికీ ప్రభుత్వ పెద్దలు చెప్పే పనులన్నింటికీ " ఎస్ " అనే అధికారి కోసం పురపాలక శాఖలో వెతుకులాట మొదలైనట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జివిఎంసి కమిషనర్ గా సంపత్ కుమార్ ను నియమించింది. ఆయన దాదాపు ఆరు నెలల పాటు విధులు సమర్థవంతంగా నిర్వహించినప్పటికీ అనతి కాలంలోనే ఆయన బదిలీ చేసింది. రాష్ట్రంలో అన్ని ఖాళీలను భర్తీ చేసిన ప్రభుత్వం జీవీఎంసీ కమిషనర్ పోస్టు మాత్రం ఇన్చార్జి పాలనలోనే నడుపుతుంది. 8 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉన్న జీవీఎంసీ లో దాదాపు 30 లక్షల మంది ప్రజలు నివసిస్తున్నారు. విస్తీర్ణంలో చిన్నదైనప్పటికీ, జనాభా ప్రాతిపదికన రాష్ట్రంలోనే అతిపెద్ద నగరంగా విశాఖ ఉంది. ఆర్థిక, పారిశ్రామిక, పర్యాటక, విద్య, వైద్య రంగాల్లో విశాఖ ప్రత్యేకత రాష్ట్రంలోనే ప్రాధాన్యత రంగాల్లో ఒకటిగా ఉన్నప్పటికీ, జీవీఎంసీ లో కీలకంగా పరిపాలన చేసే అధికారిని మాత్రం ప్రభుత్వం నియమించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జీవీఎంసీ పరిధిలో విలువైన ప్రభుత్వ భూముల్లో నిర్మాణ అనుమతులు, టిడిఆర్లు మంజూరు తోపాటు కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు కమిషనర్ కీలకం కానున్నారు అయితే ప్రభుత్వ పెద్దలు చెప్పే ప్రతి పనికి " ఎస్" అనే అధికారి కోసం వెతుకులాట చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కొంతమంది యువ ఐఏఎస్ అధికారులను పరిశీలనలో పెట్టినప్పటికీ ఖరారు కాకపోవడంతో ఎవర్ని నియమించలేదని తెలుస్తుంది. విశాఖ జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు తోపాటు రాష్ట్ర ప్రభుత్వంలో కీలక మంత్రులు, నేతలు ఆమోదంతోనే జీవీఎంసీ కమిషనర్ ఎంపిక జరుగుతుందని మరోపక్క ప్రచారం సాగుతుంది. మరొ పక్క జీవీఎంసీలో మేయర్ మార్పుకోసం సన్నా హాలు మొదల య్యాయి. నాలుగేళ్ల పదవీ గడువు మార్చి18 తో పూర్తి కావడంతో కూటమి ప్రభుత్వం తమ అభ్యర్థిని ఆఖరి ఏడాదికి మేయర్ గా ఎంపిక చేసుకునేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిగానే మార్చి నెలలో మేయర్ మార్పు ఖాయమని విస్తృత ప్రచారం సాగుతుంది.

అపోకాస్ రద్దు విధానం సరికాదు....

జీవీఎంసీ వద్ద ఉద్యోగుల ఆందోళన...

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: జి.వి.యం.సి కాంట్రాక్టు వర్కర్స్ & లేబర్ యూనియన్ గౌరావాధ్యక్షులు యం.ఆనందరావు ఆధ్వర్యంలో సోమవారం జివియంసి ప్రధాన కార్యాలయం గేటు ఎదురుగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో పని చేయుచున్న ఔట్సోర్సింగ్ కార్మికులకు గత ప్రభుత్వం అప్కోస్ అను సంస్థ ద్వార ఒకే గొడుగు క్రిందకు తీసుకువచ్చి దళారి వ్యవస్థ లేకున్నా బ్యాంకు ద్వార జీతము, పీఎఫ్, ఈ ఎస్ ఐ సౌకర్యం కల్పించి ఔట్సోర్సింగ్ కార్మికులకు భరోసాగా నిలిచింది. కాని ఈ మధ్య కూటమి ప్రభుత్వము అపోకోస్ విధానం రద్దు చేసి, శాఖా పరంగా ఏజెన్సీలకు అప్పజేప్పుతారని రాష్ట్ర కాబినెట్ లో నిర్ణయము తీసుకున్నారని పత్రికలలో వచ్చిన వార్తల ద్వార ఔట్సోర్సింగ్ కార్మికులు ఆందోళన చెందుతున్నారు. అపోకోస్ ను రద్దు పరచవలసి వస్తే అంతకన్నా మెరుగైన వ్యవస్థను తీసుకురావాలి లేదా వివిధ ప్రభుత్వ రంగ సంస్థలలో పని చేయుచున్న ఔట్సోర్సింగ్ అపోకోస్ ఉద్యోగులకు (మినిమం టైం స్కేల్) అమలు చేయాలని. లేనిచో రాష్ట్ర వ్యాప్తంగా అపోకోస్ ఉద్యోగులు ఆందోళన కార్యక్రమములు ఉదృతం చేసి అవరమైతే నిరవధిక సమ్మెకైనా వెనుకాడబోమని తెలియజేసారు. ఈ కార్యక్రమములో అధిక సంఖ్యలో కార్మికులు సత్యం, సతీష్, రామకృష్ణ, ఈశ్వర రావు, ప్రసాద్, శ్రీను, కనకరాజు, జీవన్, శేఖర్ మోహన్,రాజ, కృష్ణా , గురూజీ, రవి, శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

ముగిసిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నామినేషన్ల గడువు

- 10 నామినేషన్లు దాఖలు
- 11న పరిశీలన, 13న ఉపసంహరణ

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ల పర్వం సోమవారంతో ముగిసింది. ఇప్పటి వరకు పది మంది నామినేషన్లు వేశారు. ఆఖరి రోజు రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులు పెదపెంకి శివప్రసాద్, సుంకర శ్రీనివాసరావులు రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ కు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత పత్రాలను అందజేశారు. ఈ క్రమంలో అభ్యర్థుల చేత రిటర్నింగ్ అధికారి ప్రమాణం చేయించారు. ఫిబ్రవరి 03వ తేదీన నోటిఫికేషన్ వెలువడగా, 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగింది. సోమవారం తాజాగా ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో పోటీకి దిగేందుకు ఆసక్తి కనబరుస్తూ వివిధ ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో పది మంది నామినేషన్లు వేశారు. అయితే వీరి నామినేషన్ల పరిశీలన ప్రక్రియ 11న, ఉప సంహరణ 13న ఉంటుంది. పరిశీలన, ఉపసంహరణ పూర్తయిన తర్వాత బరిలో ఎంత మంది నిలుస్తారన్నది తేలుతుంది. దాని తర్వాత ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు గుర్తుల కేటాయింపు, ఇతర ప్రక్రియలు కొనసాగుతాయి.

నామినేషన్లు వేసిన అభ్యర్థులు వీరే..

1) కోసూరు రాధాకృష్ణ, 2) పాకలపాటి రఘువర్మ , 3) సత్తలూరి శ్రీరంగ పద్మావతి, 4) కోరెడ్ల విజయ గౌరి, 5) నూకల సూర్యప్రకాశ్, 6) రాయల సత్యనారాయణ, 7) గాదె శ్రీనివాసులు నాయుడు, 8) పోతల దుర్గారావు, 9) పెదపెంకి శివప్రసాద్, 10) సుంకర శ్రీనివాసరావు. ఎమ్మెల్సీ నోటిఫికేషన్ వెలువడిన రోజు నుంచి నామినేషన్ల గడువు ముగిసే వరకు మొత్తం ప్రక్రియను ఆర్వో ఆదేశాల మేరకు ఏఆర్వో, జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్ పర్యవేక్షించారు. నోడల్ అధికారి దయానిధి, ఎన్నికల సెల్ అధికారులు ఇతర సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేశారు. అభ్యర్థులకు పూర్తి సహాయ, సహకారాలు అందజేశారు.

మౌలిక వసతులు కల్పించండి : సిపిఐ డిమాండ్

విశాలాంధ్ర-గాజువాక: టిడ్కో గృహ యజమానులకు కనీస మౌలిక వసతులు కల్పించాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) గాజువాక నియోజక వర్గ సమితి జీవీఎంసీ అధికారులను డిమాండ్ చేసింది. సిపిఐ ఆధ్వర్యంలో సోమవారం టిడ్ కో గృహ యజమానులు గాజువాక జోన్ కార్యాలయం వద్ద భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. నిరసన ప్రదర్శన నుద్దేశించి సిపిఐ గాజువాక నియోజక వర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ టిడ్ కో గృహాలను లబ్ధి దారులకు అందజేసి సుమారు ఏడాది గడుస్తున్నా టిడ్ కో గృహాలకు కనీస మౌలిక సౌకర్యాల కల్పనలో అధికారులు పూర్తి గా విఫల మయ్యారని ఆరోపించారు. లబ్ధిదారులకు గృహాలు కేటాయించిన ప్పటికి, ఆ గృహాలలో మౌలిక వసతులు లేక పోవడం తో టిడ్కో లబ్ధి దారులు బయట అద్దెకు ఉంటున్నారని అన్నారు. లబ్ధిదారులకు అన్ని వసతులు కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చి నప్పటికీ ఇంత వరకు అమలు చేయలేదని అన్నారు. లబ్ధిదారులు గృహాలకు చెందిన ఈఎంఐ వడ్డీలు కట్టలేక, బయట అద్దెలు చెల్లించ లేక నానా ఇక్కట్లు పడుతున్నారు అని అన్నారు. తక్షణమే అధికారులు స్పందించక పోతే టిడ్ కో గృహాల ప్రాంగణం లో రిలే దీక్షలకు సిద్ధమని స్పష్టం చేశారు. అనంతరం జోనల్ కమిషనర్ శేషాద్రికి వినతి పత్రం అందజేశారు. ఇంకా ఈ నిరసన ప్రదర్శనలో సిపిఐ నాయకులు జి.ఆనంద్, కె.అచ్యుత రావు, పెదపూడి దుర్గారావు, అప్పారీ విష్ణుమూర్తి, టిడ్ కో నివాసిత సంఘం నాయకులు అప్పల రాజు ,మహిళా సమాఖ్య నేతలు కె.వనజాక్షి , పి. పద్మ పాల్గొన్నారు.

అంతర్జాతీయ మూర్ఛ(ఎపిలెప్సీ)దినోత్సవం

విశాలాంధ్ర-తగరపువలస: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రెడ్డిపల్లి అప్పలరాజు జి వి యం సి ప్రాథమిక పాఠశాల బంగ్లామెట్ట లో విద్యార్థులకు మూర్ఛ వ్యాధి గురించి తరగతి గదిలో అవగాహన కల్పించారు . ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నెలలో రెండవ సోమవారం మూర్ఛ దినోత్సవాన్ని నిర్వహిస్తారని విద్యార్థులకు తెలియజేశారు. మూర్ఛ(ఎపిలెప్సీ) అనేది పునరావృతమయ్యే, ప్రేరేపించబడని మూర్ఛలతో కూడిన నాడీ సంబంధిత రుగ్మత అని ఈ మూర్ఛలు మెదడులోని అసాధారణ విద్యుత్ కార్యకలాపాల ఫలితంగా ఉంటాయని, వాటి ఫ్రీక్వెన్సీ, తీవ్రత మరియు రకం పరంగా విస్తృతంగా మారవచ్చునని ఎవరినైనా ప్రభావితం చేసే వివిధ రకాల మూర్ఛలు ఉండవచ్చునని మూర్ఛ దాడి బాల్యంలో లేదా వృద్ధులలో ఎక్కువగా కనిపిస్తుందిని ఇది జన్యుపరమైన కారకాలు, మెదడు గాయం, ఇన్ఫెక్షన్లు లేదా తెలియని కారణాల వల్ల సంభవించవచ్చునని అయితే దీనికి కూడా చికిత్స చేయవచ్చునని తెలిపారు.ఎపిలెప్సీ వ్యాధి లక్షణాలలో స్పృహ కోల్పోవడం, అనియంత్రిత కదలికలు, ఆకస్మిక గందరగోళం ప్రతిస్పందన లేకపోవడం తదితర అంశాలు ఉంటాయని తెలిపారు. ఇంటర్నేషనల్ బ్యూరో ఫర్ ఎపిలెప్సీ మరియు ఇంటర్నేషనల్ లీగ్ ఎగైనెస్ట్ ఎపిలెప్సీ సంయుక్త ప్రయత్నాలతో, ఈ రోజును ప్రపంచవ్యాప్తంగా ఎపిలెప్సీ(మూర్ఛ దినోత్సవం) జరుపుకుంటారని వైద్య మరియు ఆరోగ్య సంరక్షణ నిపుణులు, వివిధ సంస్థలు మరియు వ్యక్తులు అవగాహన పెంచడానికి, కళంకాలను తొలగించడానికి మరియు మూర్ఛతో జీవిస్తున్న వారిలో ధైర్యాన్ని నూరిపోయడానికి అందరూ కలిసికట్టుగా వస్తారని తెలియజేశారు. మూర్ఛ వస్తే ఎలాంటి జాగ్రత్తలు, చర్యలు తీసుకోవాలో విద్యార్థులకు నాటక రూపంలో అవగాహన కలిగించారు. నాటకాన్ని ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

అనంతవరం, గంధవరంలలో జెసి పర్యటన

విశాలాంధ్ర-పద్మనాభం: పద్మనాభం మండలం అనంతవరం, గంగవరం గ్రామాలలో సోమవారం జెసి ఎం అశోక్ పర్యటించారు. అనంతవరం, గంధవరం ఈ క్రాఫ్ నమోదు గురించి వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ సత్వరమే ఈక్రాఫ్ బుకింగ్ చేసుకోవాలని దాని ద్వారా రైతులు మరింత మేలు జరుగుతుందని ఆయన తెలియజేశారు. గంధవరం గ్రామంలో జరుగుతున్న రీ సర్వేపై కూడా సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.రైతులకు భవిష్యత్తులో ఏ ఇబ్బంది లేకుండా ఎంతో పగడ్బందీగా రి సర్వే చేయాలని సంబంధిత శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జేసీతో పాటు స్థానిక తాసిల్దార్ కే ఆనందరావు,మండల సర్వేయర్, వ్యవసాయ శాఖ అధికారులు, ఇతర అధికారులు మరియు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

మల్ల కోటేశ్వరరావుని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్

విశాలాంధ్ర-పెందుర్తి: గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న, పెందుర్తి నియోజకవర్గం సబ్బవరం మండలం ఆరిపాక గ్రామపంచాయతీ వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు మాజీ ఎంపీటీసీ మల్ల కోటేశ్వరరావును పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ సోమవారం పరామర్శించారు. పార్టీ నాయకులతో కలిసి కోటేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని అన్ని విధాలుగా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరిపాక సర్పంచ్ సురేష్ రాజ్, మాజీ జడ్పిటిసి సభ్యులు కోటన్న రాము, మాజీ ఎంపీపీ ముత్యాల నాయుడు, గాలి భీమవరం సర్పంచ్ రాజేష్, కోటి నాయుడు, మల్ల బాలాజీ, టెక్కలి పాలెం మాజీ సర్పంచ్ కొటాన వెంకటరమణ, కో ఆపరేటివ్ మాజీ వైస్ చైర్మన్ బొడ్డేటి మహాలక్ష్మి నాయుడు, రాజు, బండారు రమణ, పాలమరశెట్టి అప్పన్న, సరగడం రామారావు శరగడం నగేష్ , పెందుర్తి వైస్ ఎంపీపీ చిరికి దేవుడు, ఆరిపాక గ్రామం వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా నిత్య కళ్యాణం

విశాలాంధ్ర-సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి వారి ఆర్జిత సేవల్లో భాగంగా సోమవారం నిత్య కళ్యాణం వైభవంగా జరిగింది. అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింప జేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్ర నామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

విఎల్ఎస్ఐ సిస్టమ్ డిజైన్ పై గీతంలో ఎఫ్‌డిపి

విశాలాంధ్ర-మధురవాడ: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇఇసిఇ విభాగం ఆధ్వర్యంలో "విఎల్ఎస్ఐ సిస్టమ్ డిజైన్ యూజింగ్ ఓపెన్ సోర్సు టూల్స్" అనే అంశంపై రెండు వారాల పాటు నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎఫ్‌డిపి) సోమవారం ప్రారంభం అయింది. భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్ మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజి మంత్రిత్వ శాఖ సహకారంతో ఐఐటి గౌహితి, ఐఐటి జబల్‌పూర్, ఐఐటి రూర్కెలా, ఎన్ఐటి పాట్నాలతో కలసి గీతం ఈ కార్యక్రమాన్ని నిర్వహిసోందని ఇఇసిఇ విభాగం అధిపతి ప్రొఫెసర్ పి.భరణీ చంద్ర కుమార్ తెలిపారు. కాగా ఈ కార్యక్రమాన్ని ఐఐటి గౌహతి ప్రొఫెసర్ గౌరవ త్రివేది ముఖ్యఅతిధిగా ప్రారంభించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజి డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ పాల్గొని అధ్యాపకులు నూతన అంశాలపై అవగాహన పెంచుకోవాల్సిన ఆవస్యకతను వివరించారు. కార్యక్రమం కోఆర్డినేటర్ డాక్టర్ సి.హెచ్. ఆర్.ఫణికుమార్, డాక్టర్ చుక్కా రాజశేఖర్, ల్యాబ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఐ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముక్తి ద్వారానే మానవ జన్మకు సార్థతకత

పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా

విశాలాంధ్ర-విశాఖ కలెక్టర్: అరుదైన మానవజన్మకు ముక్తి ద్వారానే సార్థతకత కలుగుతుందని విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నూతన ఆశ్రమ ప్రాంగణంలో జరుగుతున్న పీఠం 97వ వార్షిక జ్ఞాన మహాసభలో ఆలీషా మాట్లాడుతూ జీవాత్మ పరమాత్మగా పరిణామం చెందే అద్భుత అవకాశం ఒక్క మానవజన్మకు మాత్రమే ఉందని అన్నారు. ముక్తిని పొంది తరించడం కోసం జీవాత్మ మానవుని లోని మానసిక, శారీరక వ్యవస్థలో ప్రేరణ కలిగిస్తుందని పేర్కొన్నారు. ధర్మ మార్గం ను అనుసరించడం ద్వారా మాత్రమే ముక్తిని పొందగలు గుతారని తెలిపారు. ముక్తిని పొందాలంటే కోరికలు లేని స్థితికి మానవుడు చేరుకోవాలని అందుకోసం గురువును ఆశ్రయించి ఆధ్యాత్మిక, తాత్విక తత్వ జ్ఞానాన్ని గ్రహించాలని వెల్లడించారు. శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నందు అందిస్తున్న జ్ఞాన, ధ్యాన, మంత్ర శక్తులతో కూడిన త్రయీ సాధనను అవలంభించడం ద్వారా భుక్తి, తృప్తి, ముక్తి లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సిబిఐ మాజీ జెడి, వివి.లక్ష్మీనారాయణ, ఉమర్ ఆలీషా పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ హుస్సేన్ షా, చింత పల్లి అమృతవల్లి, పీఠం సెంట్రల్ కమిటీ సభ్యుడు డాక్టర్ పింగళి ఆనంద్ కుమార్, కె.స్వర్ణలత, డాక్టర్ ఎన్. రాంగోపాల్ వర్మ, ఎన్ఆర్ఐ సభ్యులు టిఎస్వి. శ్రీనివాస్, సూర్యకుమార్, ఉషారాణి, జెఎన్‌టియు, ప్రొఫెసర్ డాక్టర్ ఎల్. సుమలత, డాక్టర్ హరనాధ్ రాజు, సౌత్ సెంట్రల్ రైల్వే సబర్బన్ ట్రైన్స్ జనరల్ సెక్రటరీ నూర్ అహ్మద్ ఆలీ, రిలయన్స్ ఇండస్ట్రీస్ వేర్ హౌస్ మేనేజర్ కె. సుధాకర్ రెడ్డి, యోగారత్న డాక్టర్ జ్యోతుల నాగేశ్వరరావు, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, సెంట్రల్ కమిటీ సభ్యులు ఎన్ టివి వర్మ, ఎవివి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు పట్టాభిషేకం

ఆర్ఐఎన్ఎల్ ఉద్యోగికి ఎన్టిపిసి లో ఉద్యోగం

విశాలాంధ్ర-పెదగంట్యాడ: విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఇన్స్ట్రుమెంటేషన్ విభాగంలో గత పన్నెండు సంవత్సరాలుగా అధికారిగా సేవలాందించిన గోపాల్ ప్రసాద్ భగత్ మరో ప్రభుత్వరంగ సంస్థ అయిన ఎన్టిపిసి, ఎలక్ట్రికల్ ఇన్స్ట్రుమెంటేషన్ లో అధికారిగా ఎంపికైన సందర్భంగా కోకోవెన్ ఇన్స్ట్రుమెంటేషన్ ఉద్యోగులు సోమవారం ఘనంగా సత్కరించారు. స్టీల్ ప్లాంట్ ఆర్థిక సంక్షోభం సమయంలో ఆర్ఐఎన్ఎల్ నుండి ఎన్టిపిసి కి వెళ్లి అధికారిగా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. గోపాల్ ప్రసాద్ భవిష్యత్తు లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఉద్యోగులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తోటి కార్మికులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోకోవెన్ ఇన్స్ట్రుమెంటేషన్ ఉద్యోగులు కనకరాజు, అన్నపరాజు, కిరణ్ కుమార్, యేల్లేటి శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాస్,వెన్న శ్రీరామ మూర్తి, కె శ్రీరామచంద్ర రావు, ఎస్ అప్పలరాజు, నరసింహరాజు, సత్యనారాయణ, కెవిఏ బాబ్జి, సతీష్ కుమార్, పవన్ కుమార్, బి రవికుమార్, సుబ్బారావు, రొంగలి అప్పారావు పాల్గొన్నారు.

ఆదర్శ్ కళాశాలలో నులిపురుగుల మందులు పంపిణీ

విశాలాంధ్ర-పెందుర్తి: స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు నులిపురుగుల మందుల పంపిణీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్ఈ ఫ్లోరా తెలియజేశారు. పెందుర్తి హాస్పిటల్ ఏఎన్ఎం నాగప్రభావతి విద్యార్థులకు మందులు పంపిణీ చేస్తూ ప్రతి విద్యార్థి ఈ మందులను ఆరు నెలలకు ఒకసారి వేసుకోవాలని, వేసుకోవడం వల్ల విద్యార్థులకు మేలు జరుగుతుందని, ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ ఏ.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆదర్శ్ కళాశాలలో ప్రతి ఆరునెలలకు ఒకసారి ఈ మందుల పంపిణీ జరుగుతుందని, విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని హెల్త్ క్యాంపులు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆదర్శ్ హెల్త్ కేర్ కౌన్సిలర్ పి.పుష్పలీల, రాధారాణి, తదితర సిబ్బంది కి కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ టి. థియోఫిలస్ ధన్యవాదాలు తెలుపుతూ, హెల్త్ ఈజ్ వెల్త్ అనే నినాదం తో ప్రతి విద్యార్థి ముందుకు నడవాలని తెలిపారు.

అర్ధరాత్రి అక్రమ నిర్మాణాలకు బ్రేక్...

నేలమట్టం చేసిన రెవెన్యూ అధికారులు...

ఆక్రమానికి గురైన మానసాస్ సంస్థ స్థలాన్ని స్వాధీనం చేసుకున్న రెవెన్యూ అధికారులు

విశాలాంధ్ర-ఆనందపురం: ఆనందపురం మండలం బోని గ్రామంలో మానసాస్ సంస్థకు చెందిన భూమిని కొందరు నాయకులు ఆక్రమించి సుమారు 6 షాపులు నిర్మించారు.ఈ నేపథ్యంలో మానసాస్ సంస్థ యాజమాన్యం జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్ కు ఫిర్యాదు చేశారు.కలెక్టర్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన మండల తహసిల్దార్ శ్యాం ప్రసాద్, ఆనందపురం సర్కిల్ ఇన్స్పెక్టర్. సిహెచ్.వాసు నాయుడు సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. సోమవారం తెల్లవారుజాము 3 గంటల సమయంలో ఆక్రమించిన నిర్మించిన 6 దుకాణం సముదాయాలను జెసిబి సహాయంతో నేలమట్టం చేశారు. అనంతరం ఘటన స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.ఆక్రమణదారులకు ముందస్తు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ దుకాణం సముదాయాల నిర్మాణాలు చేపట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

చీమల వెంకటాపురంలో అగ్నిప్రమాదం

పరామర్శించిన భీమిలి జనసేన ఇంచార్జ్ సందీప్

విశాలాంధ్ర-ఆనందపురం: ఆనందపురం మండలంలో గొట్టిపల్లి పంచాయతీ చీమల వెంకటాపురం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి 11 : 30 నిమిషాలకు జరిగిన అగ్ని ప్రమాదంలో బొట్ట రమణ, రాము, కుటుంబీకుల పూరిల్లు షార్ట్ సర్క్యూట్ వలన పూర్తిగా దగ్ధమైంది. అయితే ఆ సమయంలో నివాసంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం లేదని కానీ లక్ష రూపాయలు నగదు, రెండు తులాలుబంగారం, వస్తువులు, పలు డాక్యుమెంట్లు అగ్నికి ఆహుతి అయ్యాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న జనసేన ఇంచార్జ్ సందీప్ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలన చేసి కుటుంబానికి కావలసిన నిత్యవసర సరుకులు అందజేశారు. కష్ట కాలంలో కుటుంబానికి మేమున్నామంటూ భరోసా కల్పించారు అనంతరం ప్రభుత్వ తరఫునుంచి రావలసిన ఆర్థిక సాయాన్ని అందేటట్లు చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, శ్రీకాంత్, అధ్యక్షులు తమ్మిన అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి కోరుకొండ మూర్తి, ఉపాధ్యక్షులు బాలు, శివకృష్ణ, జాన అప్పలకృష్ణ, సాయి తదితర నాయకులు పాల్గొన్నారు.

భీమిలి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం నాది

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

విశాలాంధ్ర-తగరపువలస: పాతికేళ్ళుగా భీమిలి ప్రజలకు రాజకీయంగా, సామాజికంగా సేవలందించి వారి గుండెల్లో ఎనలేని ఆప్యాయతను సంపాదించానని అదే ఈరోజు నా రాజకీయ చరిష్మాకు నిదర్శనమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. భీమిలి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గంటా నూకరాజు మీడియాతో మాట్లాడారు. అనునిత్యం ప్రజలమధ్య ఉంటూ, నిస్వార్ధ రాజకీయాలు చేస్తూ, 24/7 ప్రజలకు విశిష్ట సేవలు అందిస్తున్న నాపై స్థానిక వైసిపీ నాయకులు పనికట్టుకొని విమర్శలు చేయడం మానుకోవాలని అన్నారు. రాజకీయాల్లో నా అర్హత కోసం మాట్లాడుతున్నారని అన్నారు. నాలుగు దశబ్దాల చరిత్ర కలిగిన రాజకీయ పార్టీ, సామాన్యుల గుండెల్లో నుండి పుట్టిన పార్టీ, ఈ రాష్ట్రాన్ని పాతికేళ్ళు పాలించిన తెలుగుదేశం పార్టీలో రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నానని అన్నారు. పార్టీకి నేను చేసిన సేవలకు గాను అదనంగా టెక్కలి, కురుపాం, పెందుర్తి నియోజకవర్గాలకు ఎన్నికల పరిశీలకులుగా అధిష్టానం నియమించిందని అన్నారు. రాష్ట్ర రాజకీయాలపై మాట్లాడే అర్హత నాకు ఉందని అన్నారు. వైసిపీ అధికారంలో ఉండేటప్పుడు కూడా నేను రాష్ట్ర రాజకీయాలపై మాట్లాడానని ఇది మీరు తెలుసుకొని మాట్లాడాలని అన్నారు. కూటమి ప్రభుత్వం హామీల అమలు కోసం మీరు మాట్లాడటం దెయ్యాలు వేదాలు అల్లినట్లుందని అన్నారు. మీరు అధికారంలో ఉండగా ప్రజలు భయంతో ఉన్నారని... ఇప్పుడు ప్రజలు గుండెలమీద చేయి వేసుకొని కూటమి ప్రభుత్వం మీద నమ్మకంతో సంతోషంగా ఉన్నారన్నారు. వైసిపీ పార్టీలో విజయసాయిరెడ్డి, వై.ఎస్. షర్మిల కంటే మీరెక్కువ కాదని, వారే జగన్మోహన్ రెడ్డి అరాచకాలు భరించలేక పదవులకు రాజీనామాలు చేసి పార్టీకి వీడ్కోలు పలికారని అన్నారు. సూపర్ సిక్స్ అమలు దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందని అన్నారు. సామాజిక ఫించన్ 4,000 రూపాయలు చేశారని, సంవత్సరానికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నారని, డిఎస్సీ నోటిఫికేషన్ సిద్ధం అయిందని, ఉచిత ఇసుక అందిస్తున్నారని ఇవన్నీ కళ్ళు తెరిచి చూడాలని అన్నారు. మత్స్యకారుల భరోసా పదివేలు నుండి ఇరవై వేలుకు పెంచారని, విద్యా దీవెన ద్వారా ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికి జూన్ నెలలో ఒక్కొక్కరికి 15,000 వేల రూపాయలు అందిస్తారని అన్నారు. రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని కూటమి ప్రభుత్వంలో మీరందరూ ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ ఆలోచనతో రాష్ట్రంలో ఉండే రోడ్లన్నింటిని పూడ్చి ప్రజలకు మేలైన రవాణా సౌకర్యం కల్పించారని అన్నారు. ఐదేళ్లలో మీరేమి చేశారని నిలదీశారు. ఒక్క బిసి కార్పొరేషన్ లోన్ ఇచ్చారా..? కులవృత్తులు చేసుకొనే వారికి సబ్సిడీపై పనిముట్లు ఏమైనా ఇచ్చారా..? అని అడిగారు. బిసి, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ నిధులను దారి మళ్లించారని, చివరికి డ్వాక్రా అక్క చెల్లెమ్మలు దాచుకున్న భీమా సొమ్ములు కూడా కాజేశారని అన్నారు. రాష్ట్రంలో ఉండే ప్రభుత్వ ఆస్తులను కూడా వదలకుండా తనకా పెట్టి రాష్ట్ర పరువు తీశారని అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన మీ నాయకుడిని ముందు అసెంబ్లీలో అడుగుపెట్టాలని గంటా నూకరాజు హితవు పలికారు.

నిస్సాన్ సర్వీస్ వర్క్‌షాప్ ప్రారంభం

విశాలాంధ్ర-విశాఖపట్నం: ప్రముఖ కార్ల షోరూం నిస్సాన్ సంస్థ రెండు కొత్త టచ్‌పాయింట్‌లను ఒక షోరూమ్, అత్యాధునిక సర్వీస్ వర్క్‌షాప్ ను నగరంలో ఏర్పాటు చేసింది. సోమవారం కొత్త ఆరెంజ్ నిస్సాన్ షోరూమ్ వర్క్‌షాప్‌ను తూర్పు నావల్ కమాండ్ చీఫ్ స్టాఫ్ ఆఫీసర్ (పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్) రియర్ అడ్మిరల్ ఎం మురళీ మోహన్ రాజు, సీనియర్ అధికారులు, నావల్ ప్రాజెక్ట్స్ మేనేజ్‌మెంట్ టీమ్ కమోడోర్ అమర్‌జీత్ సలుజా, రీజినల్ మేనేజర్ కెప్టెన్ ఎన్ ఆర్ చక్రవర్తి ప్రారంభించారు. నిస్సాన్ మోటర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సౌరభ్ వత్స మాట్లాడుతూ నిస్సాన్ మోటర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకలాపాలను విస్తరించిందన్నారు. ఈ అభివృద్ధి నిస్సాన్ తన పరిధిని మెరుగుపరచడానికి మరియు భారతదేశం అంతటా కీలక మార్కెట్లలో సజావుగా అమ్మకాలు, సేవాఅనుభవాలను అందించడానికి కొనసాగుతున్న ప్రయత్నాలకు అనుగుణంగా ఉంటుందన్నారు. ఈ షోరూమ్ 4,270 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉందని, నిస్సాన్ వాహనాల శ్రేణిని అన్వేషించడానికి కస్టమర్‌లకు లీనమయ్యే అనుభవాన్ని అందిస్తుందన్నారు. ఈ సర్వీస్ వర్క్‌షాప్ 11,302 చదరపు అడుగుల విస్తీర్ణంలో 18,100 చదరపు అడుగుల బహిరంగ ప్రదేశంలో విస్తరించి ఉందన్నారు.

నోటి క్యాన్సర్ పై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర-తగరపువలస :అంతర్జాతీయ ఓరల్ అండ్ మాక్సిల్లోఫేషియల్ సర్జన్స్ దినోత్సవం సందర్భంగా - ఫిబ్రవరి 13 న (అసోసియేషన్ ఆఫ్ ఓరల్ అండ్ మాక్సిల్లో ఫేషియల్ సర్జన్స్ ఆఫ్ ఇండియా)నిర్దేశించిన విషయం పై ప్రజల్లో అవగాహన కల్గించేందుకు ఓరల్ సర్జన్స్ అందరూ కృషిచేస్తారు. ఈ సందర్భంగా నోటి క్యాన్సర్ పై అవగాహన ర్యాలీ నిర్వహించడానికి అనిడ్స్ (అనిల్ నీరుకొండ ఇన్స్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్) ఓఎంఎఫ్ఎస్ విభాగం వారు ముందుకువచ్చారు. సోమవారం ఉదయం 10 గం " లకు అనిడ్స్ , ఎఎన్హెచ్ దగ్గర మొదలై,తగరపువలస కూడలి వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా నోటి క్యాన్సర్కు కారకాలైన ధూమపానం,గుట్కా నమలడం మొదలైన దురలవాట్లకు దూరం అవ్వాలని ప్రజల్లో అవగాహన కల్పించారు. అనిడ్స ప్రిన్సిపాల్ ఎల్ వంశీకృష్ణారెడ్డి పర్యవేక్షణలో "ఓఎమ్ఎఫ్ఎస్" హెచ్ఓడి డాక్టర్ ఫణి కుమార్ కూచిమంచి ఆద్వర్యం లో "ఓఎమ్ఎఫ్ఎస్" అధ్యాపకులు వైద్యులు,విద్యార్థులు,ఎన్సిసి వాలంటీర్లు,తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్లో గుర్తింపు తీసుకురావాలి

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: అఖిల భారత మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీకి పాల్గొనే క్రీడాకారులు వర్సిటీకి గుర్తింపు తీసుకురావాలని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని అన్నారు. హిమాచల్ ప్రదేశ్లోని ధర్మశాల యూనివర్సిటీ ఈ నెల 14వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు మహిళల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు వర్సిటీ తరపున శ్రీకాకుళం నగరంలోని జి.హర్షిత (శారదా డిగ్రీ కళాశాల), డి.హేమశ్రీ (విద్యాధరి డిగ్రీ కళాశాల), ఎస్.ఝాన్సీలక్ష్మి (ప్రభుత్వ డిగ్రీ కళాశాల) హాజరవుతున్నారు. ఈ క్రీడాకారిణులను వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. సుజాత తదితరులు అభినందించారు.

బంటుపల్లి పంచాయతీలో గ్రామ సంఘం సమావేశం

విశాలాంధ్ర-ఆనందపురం: ఆనందపురం మండలం బంటుపల్లి వారి గ్రామపంచాయతీలో డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి .లక్ష్మీపతి ఆధ్వర్యంలో గ్రామ సంఘం సమావేశాన్ని పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘ సభ్యులు అందరూ తీసుకున్న అప్పుల ద్వారా జీవనోపాధి పెంపొందించి కార్యక్రమాలకు ఉపయోగించు కోవాలని ఎటువంటి సొంత అవసరాలకు ఉపయోగించకూడదని, పి ఎం సూర్య ఘర్ పదకం ద్వారా అర్హత ఉన్న ప్రతి మహిళ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు. అనంతరం మండలంలో మహిళా మార్టు ను సందర్శించి అమ్మకాలు పెరగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఆదినారాయణ, ఐబి ఏపిఎం ప్రభాకర్, సీసీ జానకి, సంఘాల మహిళలు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు ఆన్లైన్లో దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుప్పలవలస లోని బాలురు, ఎచ్చెర్లలోని బాలికల పాఠశాల/ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరాల్లో భర్తీకి ఆన్లైన్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాలు బోర బుచ్చిరాజు, బి.లక్ష్మిలు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ పాఠశాల/కళాశాల్లో ఐదో తరగతిలో చెరో 80 సీట్లు, ఇంటర్లో ఎంపీసీ, బైపీసీలో కలిపి చెరో 80 సీట్లు వంతున ఉన్నట్లు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు వచ్చే నెల 6వ తేదీలోగా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఐదో తరగతిలో ప్రవేశానికి ఏప్రిల్ 6న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు. ఇంటర్లో చేరేందుకు అదే రోజు మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని చెప్పారు. అదనపు సమాచారం కోసం ఫోన్ నెంబర్లు 8790939186, 90141 27134కు సం ప్రదించాలన్నారు.

ఆనందపురంలో శ్రీ ముద్ర స్కూల్ ప్రారంభం
ముఖ్య అతిథిగా భీమిలి ఎమ్మెల్యే గంటా

విశాలాంధ్ర- ఆనంద పురం : నేటి బాలలే రేపటి పౌరులు దేశ భవిష్యత్తు, వారి చేతుల్లో ఉందని, పిల్లలు ఉజ్వల బంగారు భవిష్యత్తుకు పునాది వేసేది ఉపాధ్యాయులేనని క్రమశిక్షణ తో పాటు నైతిక విలువలు కూడిన విద్యను అందించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన ఆనందపురం గ్రామంలో శ్రీ ముద్ర పాఠశాలను శాసనసభ్యులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్వయం శక్తితో ఎదగాలని ఆయన చెప్పారు. యువకులు విద్యావంతులు శ్రీ ముద్ర స్కూల్ చైర్మన్ కుప్ప లహరి, డైరెక్టర్లు కాకర సురేష్ కుమార్, పల్లి వీరాస్వామి ఈ పాఠశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ పాఠశాలలో నాణ్యత ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలన్నారు. ముందుగా ఆయన పాఠశాల ఆవరణలో శ్రీ సరస్వతి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం తరగతి గదులు లను ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులను సీనియర్ నాయకులు కాకర వెంకటరమణ ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ఐటిబిపి సెకండ్ ఇన్ కమాండ్ సూరజ్ ప్రకాష్ జోషి , భీమిలి నియోజకవర్గం టీడీపీ, జనసేన, బిజెపి ఇన్చార్జ్ లు కోరాడ రాజబాబు, డాక్టర్ సందీప్ పంచకర్ల, కంటుభుక్త రామానాయుడు, ఆనందపురం, భీమిలి జడ్పిటిసిలు కోరాడ వెంకట్రావు, గాడు వెంకటప్పుడు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ బంటుపల్లి మణి శంకర్ నాయుడు, స్థానిక సర్పంచ్ చందక లక్ష్మి, ఎంపీటీసీ కొట్యాడ రమాదేవి రెడ్డి బాబు, ఎంపీటీసీ -2 బంటుపల్లి అప్పలస్వామి, సన్ స్కూల్ డైరెక్టర్ కైత పల్లి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు కాకర్లపూడి శ్రీకాంత్ రాజు, మీసాల సత్యనారాయణ, బి ఆర్ బి నాయుడు, తాత్రాజు అప్పారావు,బమ్మిడి ఉమ ఇతర నాయకులు సర్పంచులు ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నాంది ఫౌండేషన్ వారి స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

విశాలాంధ్ర-భీమిలి: భీమునిపట్నం స్థానిక పండిట్ నెహ్రూ జీవీఎంసీ హై స్కూల్ కు చెందిన 131 మంది విద్యార్థులకు నాంది ఫౌండేషన్ వారు శుక్రవారం నాడు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. ఇందులో టీ షర్ట్ నోట్ పుస్తకాలు స్పోర్ట్స్ సానిటరీ నాప్కిన్స్ పెన్సిళ్లు షూస్ మరియు సాక్స్ మొదలైన ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయనీ శ్రీమతి తిరుమల శ్రీదేవి మరియు ఫౌండేషన్, స్కిల్ అసోసియేట్ లీల మరియు పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ అసంఘటిత కార్మిక సంఘం అధ్యక్షుడిగా విన్నకోట

విశాలాంధ్ర-పెందుర్తి : అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా విన్నకోట రామును ఆ పార్టీ అధిష్టానం నియమించింది. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, పి సి సి అధ్యక్షురాలు షర్మిల, స్టేట్ అసంఘటిత కార్మికుల,ఉద్యోగుల కాంగ్రెస్ చైర్మన్ కైపు వెంకట కృష్ణారెడ్డి, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు మీసాల సుబ్బన్న కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తనపై నమ్మకం ఉంచి అధిష్టానం ఇచ్చిన పదవికి న్యాయం జరిగేలా చేస్తానన్నారు ఏఐటీయూసీ యూనియన్ లో కూడా అనేక కార్యక్రమాలు చేసిన అనుభవం ఉందని ఈ అనుభవం ద్వారా కార్మికుల ఉద్యోగాలు సమస్యలు పరిష్కారాన్ని కృషి చేస్తానని తెలిపారు.అలాగే కాంగ్రెస్ బలోపేతనికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

పెందుర్తి రామాలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర-పెందుర్తి: జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ పునః నిర్మాణానికి సోమవారం ఉదయం భక్తి ప్రవత్తులతో శంకుస్థాపన చేశారు. తెల్లవారుజాము నుండి వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా జనసేన జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గ శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు, మాజీ శాసనసభ సభ్యులు అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, జీవీఎంసీ తెలుగుదేశం పార్టీ ఫ్లోర్ లీడర్ స్థానిక కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు ,భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి గొర్లె రామనాయుడు,వార్డు అధ్యక్షులు వేగి పరమేశ్వర రావు, డిబిఎల్ నాయుడు, వేగి దివాకర్,గొర్ల అప్పారావు మొదలగు స్థానిక ముఖ్య నాయకులు గ్రామ పెద్దలు పెందుర్తి మండలం ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు వీర మహిళలు పాల్గొన్నారు.